పేద విద్యార్థికి చేయూత



కళాశాల ప్రిన్సిపాల్‌కు చెక్కును అందజేస్తున్న దృశ్యం

నల్లకుంట : ప్రతిభావంతులైన పేద బ్రాహ్మణ విద్యార్థులు ఉన్నత చదువుల కోసం తమకు తోచిన విధంగా చేయూతనందించేందుకు దాతలు ముందుకురావాలని శ్రీ వైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు కోరారు. చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ప్రధాన కార్యదర్శి మంత్రి సునిల్ తదితరులు హబ్సిగూడలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి కొమిది కుమార్ కళాశాల బోధనా రుసుముకు సంబంధించి రూ. 27 వేల చెక్కును బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ గీతకు అందజేసి మాట్లాడారు. మిగతా ఫీజు బకాయిలు నవంబర్‌లో చెల్లిస్తామని చెప్పారు. చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు దేవులపల్లి రంగారావు, రమాకుమార్ దేశ్‌ముఖ్, అశోక్‌కుమార్, లక్ష్మణ్‌రావు తదితరులున్నారు.

బాలకార్మిక నిర్మూలనకు అవగాహన ర్యాలీ



అంబేడ్కర్ కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం : చదువుకునే వయస్సులో పిల్లలను పనికి పంపొద్దని అంబేడ్కర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రిషికాంత్ అన్నారు. బుధవారం బాలకార్మిక దినోత్సవం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలల ఆధ్వర్యంలో కళాశాల నుంచి సుందరయ్య పార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రిషికాంత్ మాట్లాడుతూ.. పిల్లలను చదువుకునే వయస్సులో పనికి పంపి వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టొద్దని కోరారు. నేటి బాలలే రేపటి పౌరులని ప్రతి ఒక్కరూ దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాల కార్మికుల నిరోధానికి ప్రతి ఒక్కరూ తమవంతుగా కృషి చేయాలన్నారు. లా కళాశాల ప్రిన్సిపాల్ సృజన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివాహ పరిచయ వేదికకు ఆహ్వానం



కాంగ్రెస్ మాజీ ఎంపీ వీ.హెచ్‌ను ఆహ్వానిస్తున్న మహాసభ సభ్యులు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఆధ్వర్యంలో జూలై 14న కాచిగూడలోని మ్యాడం అంజయ్యహాల్‌లో మున్నూరు కాపు వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో మహాసభ ప్రతినిధులు బుధవారం ఏఐసీసీ సీనియర్ నేత వి.హనుమంతరావును కలిసి మున్నూరుకాపు పరిచయ వేదికకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరారు. టీపీసీసీ ఓబీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టెల సుభాష్, మహాసభ ప్రతినిధులు బీఆర్ జితేందర్, లింగిశెట్టి హనుమంతరావు, ఎనుగుల మాణిక్‌ప్రభు, మణికొండ రమేష్, కొంతం సురేష్, గోపాల రాధాకృష్ణ, కొత్తపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



స్థానికులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ జెమిని కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్య, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ కోరారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని జెమిని కాలనీలో జలమండలి, జీహెచ్ఎంసీ, విద్యుత్‌శాఖ, అర్బికల్చర్ శాఖ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయనకు వివరించారు. ప్రమాదంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, వీధిలైట్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, నాయకులు అరుణ్, బాలనర్సింహ్మా, సత్యం తదితరులున్నారు.

సాహు మహరాజ్ జీవితం స్ఫూర్తిదాయకం

లిబర్టీ: దళితుల అభ్యున్నతి, ప్రగతి కోసం సాహు మహరాజ్ జీవితాంతం పోరాటం సాగించారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వెన్న సదానందు అన్నారు. సాహు మహరాజ్ ఉదద్యమ స్ఫూర్తిని పోరాటపటిమను నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. సాహు మహరాజ్ జయంతి పురస్కరించుకొని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాహు మరాజ్ రిజర్వేషన్లు సాధించడంలో ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. సామాజికంగా వెనుకబడిన దళితులకు బీసీలకు రిజర్వేషన్ల కల్పన కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. దళితులు, బీసీలు, ఇతర వర్గాలకు రిజర్వేషన్లు అందుతున్నాయని అంటే ఆనాడు సాహు మరాజ్ వేసిన బీజమేనని సాధారణంగా గుర్తు చేశారు. కేవలం వెనుకబడిన వర్గాలకే మాత్రం కాకుండా ఎస్సీలకు, సామాజికంగా ఉన్నత స్థానంలో ఉండాలని రిజర్వేషన్ల కోసం ఆనాడే కృషి చేశారని పేర్కొన్నారు. సాహు మహరాజ్ ఆశయ సాధన కోసం పని చేయాలని సూచించారు.

స్వచ్ఛంద సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలి

లిబర్టీ: ప్రజాహితం కోసం పని చేస్తూ పేద వర్గాలకు చేయూతనిస్తున్న సంస్థలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు, ఎన్విరాన్మెంటల్ సంస్థ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఆదినారాయణ కోరారు. నిత్యం ప్రజలకు సేవలు అందిస్తున్న సమస్తకు కేంద్ర ప్రభుత్వం బాసటగా నిలవాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రి, పార్లమెంటు సభ్యుడు అనురాగ్‌ఠాకూర్‌కు వినతిపత్రం సమర్పించి అందిస్తున్న సేవలను వివరించారు. ఈసందర్భంగా ఆయన ఆత్మీయ సత్కారం చేశారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో తెలుగు రాష్ట్రాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ఆదిలీలా ఫౌండేషన్‌కు కేంద్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని విన్నవించారు. ప్రధానితో మాట్లాడి సహకారం అందించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో...

సరికొత్త బోధనకు శ్రీకారం

- అమలులోకి పూర్వ ప్రాథమిక విద్య
- ఆట పాటలు, కథలతో బోధన
- ఖైరతాబాద్ జోన్ పరిధిలో నాలుగు విడతల్లో శిక్షణ



12 వేల మందికి పైగా చిన్నారులు...

బంజారాహిల్స్: అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారుల ఆరోగ్యాన్ని పెంచడం, మెరుగైన కథలతో కూడిన విద్యను అందించడం, గ్రహణశక్తిని పెంచడం లక్ష్యంగా పూర్వ ప్రాథమిక విద్య నేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. కొన్నేళ్లుగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నప్పటికీ ఈ ఏడాది మాత్రం చక్కటి ప్రణాళికతో మరింత పకడ్బందీగా చిత్రాలతో కూడిన పుస్తకాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ సారి నూతన జాతీయ విద్యా విధానంలో 3–6 సంవత్సరాల పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య తప్పనిసరిగా బోధించాలని నిబంధన విధించారు.

- ఇందులో భాగంగానే కొత్త తరహా పాఠ్య పుస్తకాలను అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్నారు. వీటి ద్వారా బోధన ఎలా చేయాలనే దానిపై ఇప్పటికే హైదరాబాద్ జిల్లా నుంచి కొందరు సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు.
- సోమవారం నుంచి ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో ఉన్న 141 అంగన్‌వాడీ కేంద్రాలు, 10 మినీ అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు శిక్షణ ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైంది.
- నాలుగు విడతలుగా ఐసీడీఎస్ ఖైరతాబాద్ ప్రాజెక్టు పరిధిలో ఒక్కో విడతలో 35 మంది టీచర్లు చొప్పున ఒక బ్యాచ్‌ను రూపొందించారు.
- బంజారాహిల్స్, షేక్‌పేట ఐసీడీఎస్ పరిధిలో మొదటి విడతలో 38 మంది అంగన్‌వాడీ టీచర్లకు సోమ, మంగళ, బుధవారాల్లో శిక్షణ పూర్తయ్యింది. ప్రాజెక్టు పరిధిలో ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చేలా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

ఖైరతాబాద్ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారుగా 12 వేల మందికి పైగా చిన్నారులు ఉన్నారు. అలాగే 3,000 మందికి పైగా బాలింతలు, 4,000 మందికి పైగా గర్భిణీలు ఉన్నారు. వీరందరికీ పోషకాహారం అందిస్తుండగా చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య కూడా అందించాల్సి ఉంది.

- కేవలం వీరికి పోషకాహారం ఇచ్చి సరిపెట్టకుండా సరికొత్త రీతిలో బోధన చేయనున్నారు. గతంలో చదువుల కోసం పుస్తకాలు ఇచ్చినా బోధించడంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పూర్వ ప్రాథమిక విద్య తప్పనిసరిగా అమలుచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

రూ. 4 వేల కోట్ల వ్యాపారాభివృద్ధితో..

- సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్



మాట్లాడుతున్న వైఎస్ఆర్ మూర్తి తదితరులు

ముషీరాబాద్: ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ రూ.4 వేల కోట్లకు పైగా వ్యాపారాభివృద్ధి చెందిందని సొసైటీ వైస్ చైర్మన్ వైఎస్ఆర్. మూర్తి తెలిపారు. సభ్యుల సహకారంతో మరింత ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం 'ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యానగర్ బ్రాంచ్ రూ.120 కోట్లకు పైగా వ్యాపారంలో ముందకెళ్తుందన్నారు. అనంతరం 'ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. మేనేజింగ్ డైరెక్టర్ కే.వీ.సుబ్బయ్య, సోమలింగంగౌడ్, బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ, సబ్ మేనేజర్ నరేందర్, ఎగ్జిక్యూటివ్‌లు వరప్రసాద్, ప్రసన్న, గోపి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ముషీరాబాద్: ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ సెంట్రల్ జోన్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ బ్రహ్మం అన్నారు. బుధవారం శివాలయం వీధిలో సమస్యలు తెలుసుకునేందుకు స్థానిక ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సెంట్రల్ జోన్ పరిధిలో 306 ఫీడర్లు ఉన్నాయని వాటిని పరిశీలించేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా కృషి చేస్తున్నామన్నారు. విద్యుత్ శాఖ డీఈ కమల్‌కుమార్, ఏఈ శాంతారాం, సునీల్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నేతలు విశ్వం, సత్యనారాయణ, బీజేపీ నాయకులు పర్వేజ్, శరణ్ తదితరులున్నారు.

కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: తాగునీటి సమస్యతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బుధవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ డివిజన్‌లోని కుత్బిగూడ, చప్పల్‌బజార్, బర్కత్‌పుర, మణియార్ పట్టి, సునార్‌లేన్, వీరన్నగుట్ట, ప్యారగాన్ అపార్ట్‌మెంట్స్, నింబోలిఅడ్డ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాతో పాటు నీటి విడుదల సమయాన్ని మార్చాలని స్థానికులు కోరారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని జలమండలి అధికారులకు ఆమె సూచించారు. బీజేపీ నేతలు బాబన్న, మల్లికార్జున్, వాసు, నాగరాజు, సూరి, రేణుక, క్రిష్ణ తదితరులున్నారు.

అభినందన



నల్లకుంట : వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకు 'ఇంటర్నేషనల్ ఇన్సానియత్ కి కిద్మత్ సొసైటీ' నల్లకుంటకు చెందిన బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా మీడియా ఇన్‌చార్జి ఎం.ఐజాక్‌రాజ్‌కు జాతీయ సేవారత్న అవార్డు అందజేశారు. బుధవారం అవార్డు గ్రహీతను ప్రముఖ నటుడు గౌతంరాజు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి !



ప్రభుత్వ స్థలం బోర్డును చూపిస్తున్న బస్తీవాసులు

ముషీరాబాద్ : ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమవుతున్నా.. ముషీరాబాద్ తహసీల్దార్ పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. అడిక్‌మెట్ డివిజన్ ఇంటి నెంబర్ 1-9-896 పక్కనే ఉన్న ఖాళీస్థలాన్ని మహమ్మదీయ మసీదు కమిటీ సభ్యులు కబ్జాకు పాల్పడుతున్నారని స్థానికులు తెలిపారు. బస్తీవాసి రుద్ర నిగమగోచర్ మాట్లాడుతూ.. 1970లో తాము 498 గజాల్లో ఉన్న పాత ఇంటిని కొనుగోలు చేశామని, 400 గజాల్లో ఇళ్లు ఉండగా.. 98 గజాల ఖాళీ స్థలం ఉందన్నారు. 2010లో అప్పటి ముషీరాబాద్ తహసీల్దార్ సుజాత తమ ఖాళీ స్థలంతో పాటు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో గవర్నమెంట్ ల్యాండ్ బోర్డును ఏర్పాటు చేశారన్నారు. తమ స్థలంలో బోర్డు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ.. మేము కోర్టుకు వెళ్లామన్నారు. తాము ఉన్న ఇళ్లు శిథిలావస్థకు చేరడంతో జీహెచ్ఎంసీ అధికారులు కూలిపోతే ప్రాణనష్టం జరుగుతుందని ఖాళీ చేయాలని ఏడాది క్రితం నోటీసులు ఇచ్చారని తెలిపారు. 10 నెలల క్రితం తాము ఇళ్లు ఖాళీచేసి మరోచోట అద్దెకు ఉంటున్నామన్నారు. ఇదే అదునుగా పక్కన ఉన్న మసీదు కమిటీ ప్రభుత్వ స్థలం బోర్డు ఉన్న స్థలాన్ని అక్రమిస్తున్నారని వాపోయారు. రాత్రి వేళల్లో నేలపై డస్టు, సిమెంట్ వేసి చదును చేసి అక్రమించేందుకు యత్నిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మార్వో, ఆర్డీవోలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్యాక్రాంతమవుతున్న స్థలాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

మైనర్‌ను కొట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం కేసారం గ్రామంలో 7వ తరగతి చదువుతున్న దళిత మైనర్(12)ను తమ చెట్టుకు కాసిన జామకాయలను తెంపుతున్నాడనే నెపంతో తాళ్లతో కట్టేసి కులం పేరుతో దూషించిన రిటైర్డ్ టీచర్, అతడి కుమారుడిని తక్షణమే అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం చిక్కడపల్లిలోని కేవీపీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తమ ఇంటి చెట్టుకు కాసిన జామకాయలను తెంపుతున్నాడనే కారణంతో దళిత మైనర్ బాలుడిపై దౌర్జన్యానికి పాల్పడి చిత్రహింసలకు గురిచేయడం బాధాకరమన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గాంధీలో కొనసాగుతున్న మోతీలాల్ ఆమరణదీక్ష



గాంధీఆస్పత్రి: నిరుద్యోగ జేఏసీ నాయకుడు మోతీలాల్‌నాయక్ చేపట్టిన ఆమరణదీక్ష మూడో రోజైన బుధవారం గాంధీఆస్పత్రిలో కొనసాగింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల, గ్రూప్ 2, 3 పోస్టుల సంఖ్య పెంచి పరీక్షలు నిర్వహణ, ఉద్యోగ ఖాళీలు భర్తీ, మెగా డీఎస్సీ, తదితర డిమాండ్లతో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో మోతీలాల్‌నాయక్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సంగతి విదితమే. నిరాహారదీక్షను భగ్నం చేసిన పోలీసులు నాయక్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మంగళవారం రాత్రి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకూ ఆమరణ దీక్ష కొనసాగిస్తానని మోతీలాల్ నాయక్ స్పష్టం చేశారు. గాంధీఆస్పత్రిలో ఉన్న ఆయనను కర్నె శిరీషా అలియాస్ బర్రెలక్కతో పాటు పలువురు జేఏసీ నాయకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన నిరుద్యోగ సంఘ ప్రతినిధులు పరామర్శించారు. మోతీలాల్‌నాయక్ ప్రాణాలకు ప్రమాదం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

ఇతర రాష్ట్రాల వాహనాలపై చర్యలను స్వాగతిస్తున్నాం

కవాడిగూడ : రవాణాశాఖకు పన్ను చెల్లించకుండా ఇతర రాష్ట్రాల వాహనాలు తెలంగాణలో తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణాశాఖ ప్రకటించడాన్ని తెలంగాణ రాష్ట్ర క్యాబ్ ప్రొటెక్ట్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర. అధ్యక్షుడు కె.సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఉంటున్న ఇతర రాష్ట్ర వాహనాలతో తెలంగాణ ప్రాంత క్యాబ్ డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఇతర రాష్ట్రాల వాహనాలపై పన్ను వసూలు చేయడంతో పాటు జరిమానా కూడా విధించేందుకు రవాణాశాఖ సిద్ధమైనందుకు తెలంగాణ క్యాబ్ డ్రైవర్లకు మేలు జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నగరంలో దాదాపు 2000లకు పైగా ఇతర రాష్ట్రాల వాహనాలు తిరుగుతున్నాయని, వీటిలో స్థానికంగా పన్ను చెల్లించని వాహనాలు కొన్నైతే హైదరాబాద్ బయట మరో వేయి వాహనాలు ఉన్నాయన్నారు. వీటన్నింటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'డబుల్' ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధి లాలాపేట చంద్రబాబునగర్‌లో వెంటనే డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని బస్తీ వ్యవస్థాపక అధ్యక్షులు కోళ్ల వెంటేష్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్‌తో చర్చించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నుంచి ఇక్కడి ప్రజలు ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. దాదాపు వందల కుటుంబాలు ఇళ్లు లేక వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంపై డిప్యూటీ మేయర్ సానుకూలంగా స్పందించినట్లు కోళ్ల వెంకటేష్ యాదవ్ తెలిపారు.

బీసీల సమస్యల పరిష్కారానికి కృషి



మంత్రి పొన్నంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

కాచిగూడ: బీసీల సమస్యల సత్వర పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి నేతృత్వంలో పలు బీసీ సంఘాల ప్రతినిధులు బుధవారం మంత్రిని కలిసి బీసీల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా బీసీల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీసీల బతుకుల్లో మార్పు తప్పకుండా వస్తుందని బలంగా నమ్ముతున్నామన్నారు. బీసీ కుల గణన చేయాల్సిన ఆవశ్యకత, బీసీ కులాల కార్పొరేషన్లు, ప్రత్యేక పథకాలపై మంత్రితో చర్చించినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ప్రజల్లో ఉందని పేర్కొన్నారు. మహేంద్రబాబు, సురేష్, మల్లేష్, తదితరులున్నారు.

యువత లక్ష్య సాధనలో ముందుండాలి



మాట్లాడుతున్న నార్త్ జోన్ ఏసీపీ జగన్

ముషీరాబాద్: యువత మాదకద్రవ్యాల మత్తులో పడకుండా తమ లక్ష్య సాధనతో ముందుండాలని నార్త్ జోన్ ఏసీపీ జగన్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఆర్డీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ డేను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు వాడినా సరఫరా చేసిన 100కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. యువత మాదకద్రవ్యాలకు బానిసకాకుండా సన్మార్గంలో ముందుకెళ్లాలన్నారు. ఎస్ఆర్డీ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత మత్తుకు బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వాడటం వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కుటుంబసభ్యుల్లో ప్రేమానురాగాలు తగ్గిపోతాయన్నారు. డ్రగ్స్ వల్ల జరిగే అనార్థాలను ప్రొజెక్టర్ ద్వారా యువతకు తెలియజేశారు. నల్లకుంట పోలీస్‌స్టేషన్ సీఐ జగదీశ్వర్‌రావు, సూసైడ్ ప్రివెన్షన్ యాక్షన్ కమిటీ కార్యదర్శి అశ్విన్, ఎస్ఆర్డీ సంస్థ ప్రతినిధులు రాకేష్, భూమిక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై...



గాంధీనగర్ అవగాహన ర్యాలీలో సరస్వతి తదితరులు

చిక్కడపల్లి: డెవలప్‌మెంట్ యాక్షన్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (డేర్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మత్తు మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాను అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం గాంధీనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో యువకులు డ్రగ్స్ వద్దు, డ్రగ్స్ వాడకం మానేయండి అంటూ.. నినాదాలు చేశారు. అనతంరం డేర్ ప్రాజెక్టు డైరెక్టర్ సరస్వతి మాట్లాడుతూ.. యువత మత్తులో చిత్తు కావొద్దని, ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని ఆ దిశగా ముందుకు సాగాలని సూచించారు. మత్తుకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని అస్వాధించాలన్నారు. డీఎస్ఏసీఎస్ డైరెక్టర్ కె.ప్రసాద్ తదితరులున్నారు.

చర్లపల్లి టు వేవ్‌రాక్..

- నూతన బస్సు సర్వీస్ ప్రారంభం

కవాడిగూడ : ఐటీ ఇతర ఉద్యోగుల సౌకర్యం కోసం ముషీరాబాద్ డిపో ఆధ్వర్యంలో బుధవారం నుంచి కొత్త బస్సు రూట్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామని ముషీరాబాద్ డిపో మేనేజర్ కిషన్‌రావు తెలిపారు. చర్లపల్లి బస్టాండ్ నుంచి 6డబ్ల్యూ/252 రూట్‌లో వేవ్‌రాక్ (ఐటీ కారిడార్) వరకు చర్లపల్లి, మల్లాపూర్, తార్నాకా, రాంనగర్, మెహిదీపట్నం, టోలిచౌకి, గచ్చిబౌలి, విప్రో సర్కిల్ మీదుగా వేవ్‌రాక్ వరకు ముషీరాబాద్ డిపో ఆధ్వర్యంలో నూతన బస్సు సర్వీస్‌ను ప్రారంభించామన్నారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు, విద్యార్థులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

డిపో ఉద్యోగినికి సన్మానం...



ఉమారాణిని సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు మర్చిపోయిన విలువైన వస్తువులను భద్రంగా ప్రయాణికులకు అప్పగించినందుకు ముషీరాబాద్ డిపో మహిళా ఉద్యోగి ఉమారాణిని ఫ్రీ మామ్‌సన్స్ ఆఫ్ తెలంగాణ ఏరియా సొసైటీ ఆధ్వర్యంలో ' ద యూనివర్సల్ బ్రదర్ హుడ్ డే' వేడుకల సందర్భంగా ఘనంగా సత్కరించారు.

పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించాలని..



ముషీరాబాద్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

ముషీరాబాద్: పెరుగుతున్న కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, కె.నాగలక్ష్మిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ముషీరాబాద్ చౌరస్తాలో పెరుగుతున్న ధరలపై ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మా, నాగలక్ష్మిలు మాట్లాడుతూ.. ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతున్నాయని ఆరోపించారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి పెరుగుతున్న ధరలను అదుపులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఐద్వా నగర నాయకులు వరలక్ష్మి, విమల, షబానా, రాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం



చిలకలగూడ : చిలకలగూడ కట్టమైసమ్మ నల్ల పోచమ్మ ఆలయ నూతనంగా ఏర్పాటైన ధర్మకర్తల మండలి సభ్యులు పదవి బాధ్యతలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆండాళ్, ఈఓ మహేందర్‌గౌడ్ నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ చైర్మన్‌గా గుంటి కృష్ణ, సభ్యులుగా అమృత్, దేవేందర్ యాదవ్, జగన్‌రెడ్డి, శ్రీనివాస ముదిరాజ్, జానకీ, ధరమ్‌వీర్, ఎక్స్‌అఫీసియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకులు తిరుమలాచార్యులు బాధ్యతలు స్వీకరించారు. కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో పదేళ్ల తర్వాత ఆలయ కమిటీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. నియోజకవర్గ పరిధిలో అన్ని ఆలయాలకు ట్రస్ట్ బోర్డులను త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సెవెన్‌హిల్స్ బిల్డర్ కుంచాల ఏడు కొండలు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు అభిషేక్, రవికుమార్, నాయకులు జలంధర్‌రెడ్డి, సందీప్‌రాజ్, అమర్‌గౌడ్, షకీల్‌ఖాన్, శంకర్ పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

అడ్డగుట్ట: ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. డివిజన్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో బుధవారం నిర్వహించిన సంఘం మండల సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో బడిబాట కార్యక్రమం కొనసాగుతున్నప్పటికీ మారేడుపల్లి మండల పరిధిలో ఇంకా 159 మంది పిల్లలు బడికి దూరంగా ఉన్నారన్నారు. వారిని పనుల నుంచి విముక్తి చేసి బడికి పంపే బాధ్యత విద్యాశాఖపై ఉందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల నియామకంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నామన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయాలనుకుంటే కాంట్రాక్టులు, కుటీర పరిశ్రమల ఏర్పాటు చేయాలని, చట్టబద్ధత కలిగిన పిల్లల తల్లిదండ్రులను స్కూల్ కమిటీ చైర్మన్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. దేశంలోనే మన విద్యా వ్యవస్థ 35వ స్థానంలో ఉందన్నారు. ఇకనైనా ప్రభుత్వ పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలంటే రాష్ట్రంలో తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఏవిఎం స్వామి, లక్ష్మీనారాయణ, జమున, రమాదేవి, స్వరూప, విజయ, శీలా, శశికళ, కౌసల్య, సువర్ణ, భాగ్య, సుమలత, లావణ్య, సౌజన్య పాల్గొన్నారు.